మూడు రోడ్ల జంక్షన్

బొమ్మిడి అచ్చారావు

"నేనో వింత పరిస్థితిలో చిక్కుకుపోయాను సార్! నన్ను మీరే గట్టున పడెయ్యాలి!" అన్నాడతను.

డిటెక్టివ్ కిరణ్ అతని వంక పరీక్షగా చూశాడు. వయసు ఏభై సంవత్సరాలుండొచ్చు. పచ్చటిపసిమి, ఆజాను బాహుడు. లాల్చీ, పంచె మల్లెపూవు తెల్లదనాన్ని ధిక్కరిస్తున్నాయి. చేతులకి వేళ్ళకి నాలుగేసి ఉంగరాలు, బంగారు వాచీ అతని సంపన్నతను చాటుతున్నాయి.

"చెప్పండి, ఏమిటా వింత పరిస్థితి? నే నే విధంగా మీకు సహాయపడగలను?" అడిగాడు కిరణ్.

"నా పేరు వరప్రసాద్. సిటీలో రెండు సినిమా హాళ్ళలో ఏభై పైసల వాటాలున్నాయి. మా స్వగ్రామంలో కొన్ని మాగాణి భూములు, రెండు ధాన్యం మిల్లులు వున్నాయి. నాకు యిద్దరే పిల్లలు. ఓ కొడుకు కూతురు. ఇద్దరికీ పెళ్ళిళ్ళు చేసేశాను. అమ్మాయిని అల్లుడ్ని మా ఇంట్లోనే పెట్టుకున్నాను. నా కొడుకు మా ఊళ్ళో

భూములు, మిల్లులు చూసుకుంటూ అక్కడే వుంటున్నాడు. వాడికోసం ఓ పెద్ద బంగళా అత్యాధునికంగా కట్టించి యిచ్చాను. సిటీకన్నా అక్కడే హాయిగా వుంది వాడికి.

"ఇకపోతే నా కొచ్చిన సమస్యేమిటంటే, వారం రోజులక్రితం బ్యాంకునించి రెండు లక్షలు అవసరపడి డ్రా చేసి తెచ్చాను. తీరా అవి దొంగనోట్లు అని తేలింది" ఓ క్షణం ఆగి చేతి రుమాలుతో నుదుటికిపట్టిన చెమట తుడుచుకున్నాడు హరప్రసాద్.

కిరణ్ నిటారుగా అయాడు. అతనివంకే దీక్షగా చూస్తున్నాడు.

"అంటే....బ్యాంకులోనే దొంగనోట్లు యివ్వటం జరిగిందనా మీ అనుమానం?" అడిగాడు కిరణ్.

"వాళ్ళు అన్నీ వందరూపాయల నోట్లే యిచ్చారు. అన్నీ కొత్త నోట్లు! బ్రీఫ్ కేసులో పెట్టి తెచ్చాను. నంబర్లు చూడవలసిన అవసరం సాధారణంగా వుండదు కదా అని ఆ సంగతే పట్టించుకోలేదు. కాని, తీరా అవి మారకానికి వచ్చేటప్పటికి దొంగనోట్లని తేలిపోయింది!"

"మరి వెంటనే బ్యాంకుకు వెళ్ళి వెరిఫై చేసుకోకపోయారా? కొత్తనోట్ల నంబర్స్ వాళ్ళు నోట్ చేసి వుంచుతారు. మీకు అవి ఎలా వచ్చిందీ తెలిసిపోయి వుండేది!"

"అదీ జరిగిందండి. కాని నేను వెళ్ళటం నాలుగు రోజులు పట్టింది. తెచ్చిన వెంటనే డబ్బు అవసరంలేక పోయింది. బ్రీఫ్ కేసుతో అలాగే బీర్ వాలో పెట్టేసి నాలుగో రోజున అవసరపడినపుడు చూసేటప్పటికి అవి దొంగనోట్లు! వెంటనే నోట్లు అలాగే పట్టుకుని వెళ్ళి

బ్యాంకు వాళ్ళకి చూపిద్దామనుకున్నానుగాని, వాళ్ళు నాలుగు రోజుల తర్వాత తీసుకువెళ్ళి అడిగితే నన్నే అనుమానించే ప్రమాదముందని గ్రహించాను. నాకు యిష్యూచేసిన నోట్ల నంబర్లు, సిరీస్ అడిగాను. వాళ్ళు చెప్పిన నంబర్లు, నా దగ్గరున్న దొంగనోట్లతో టాలీ కాలేదు."

కిరణ్ తలూపాడు.

"పోలీసులకి రిపోర్టిచ్చారా?"

హరప్రసాద్ నిట్టూర్చి, "తమకు తెలియదా పోలీసు వాళ్ళతో పెట్టుకుంటే కథ ఎంతవరకు పోతుందో!? ఈ సంగతి బయటి వాళ్ళెవరికి చెప్పినా చిలవలు పలవలు అల్లి తిరిగి నామీదకే తిప్పుతారు. నేనేదో దొంగనోట్లు అచ్చువేస్తున్నట్టు ప్రచారం చేసేస్తారు. నేను సంపాదించిన ఆస్తిపాస్తులన్నీ అలాగే సంపాదించానంటారు. వాటి లెక్కలు, ఆరాలు, టాక్సులు....అబ్బ, చెప్పకండి. అందుకే సరాసరి మీ దగ్గరికి వచ్చాను" అన్నాడు.

"ఆ నోట్లు తెచ్చారా?"

"మచ్చుకి ఓ కట్ట తెచ్చాను, చూడండి" అంటూ హరప్రసాద్ ఓ నోట్లకట్ట తీసి బల్లమీద పెట్టాడు.

కిరణ్ ఆ నోట్లకట్టను చూసి దొంగనోట్లంటే నమ్మలేకపోయాడు. ముమ్మూర్తులా అసలు నోట్ల లాగానే వున్నాయి అవి! రిజర్వు బాంకు గవర్నరు సంతకం, వాటర్ మార్కుతోబాటు అంతా అసలు నోటులానే వుంది.

ఓ నోటు విడదీసి పరీక్షగా చూశాడు కిరణ్. 7DG సిరీస్ నంబర్సుగల నోట్లు అవి! నోటు వెనక్కి తిప్పి చూశాడు. అన్నీ యథాతథంగానే కనిపించాయి అసలు

నోటుకిలాగానే. అయితే నోటు మధ్యగా వున్న జేగురు రంగు పైకి అసలు దానిలాగానే కనిపించినా వెలుర్లో పెట్టి చూస్తే అసలు రంగు బయట పడుతోంది. పసుపు పచ్చని రంగు కనిపిస్తోంది. వాటర్ మార్కు దగ్గర గోటితో నోటుపైన గీకిచూస్తే కనిపించాల్సిన వెండిచార, కనపడటంలేదు—తేడా కనిపిస్తోంది.

ఆ రెండు కారణాలవల్ల అవి దొంగనోట్లని నిర్ధారించటం కొంత శ్రమతో కూడిన పనే! బాహ్యనేత్రంతో ఎవరూ వాటిని దొంగనోట్లని ఎట్టిపరిస్థితుల్లోనూ గుర్తించే అవకాశంలేదు. చాలా సునాయాసంగా చేతులు మారిపోయి అసలు నోట్లతో కలిసి చలామణీ కావటం చాలా తేలిక! అయితే ఒకేసారి కట్టలుగా ఇస్తే దొరికిపోవటం కూడా కష్టంకాదు!

నోట్లు పరీక్షించటం ముగించి టేబిలుమీద పెట్టి హరప్రసాద్ వంక తిరిగి, "మీరు నాలుగురోజులపాటు నోట్లు బ్రీఫ్ తోబాటే యింట్లో వుంచానని చెప్పారు. అప్పుడు అవి స్థానం మారివుండవచ్చునేమో! ...." అన్నాడు కిరణ్.

"అదెలా సార్! ఆ నాలుగు రోజులు కొత్తవాళ్ళు గాని, బయటివాళ్ళు గాని ఎవరూ యింట్లోకి అడుగు పెట్టలేదు. పైగా బీరువా తాళాలు అనునిత్యం నాతోనే వుంటాయి. దొంగ ఎవరూ ప్రవేశించటానికి వీల్లేకుండా రెండు కుక్కల్ని ఆవరణలో వదిలేస్తాను. ఓ వాచ్ మన్ యిరవైనాలుగ్గంటలూ కాపలా వుండనే వున్నాడు. ఇంకెవరొస్తారు?"

"మరి బీరువాలోని సూట్ కేసులో వున్న నోటు

అకస్మాత్తుగా దొంగనోట్లుగా మారిపోయాయంటే ఆశ్చర్యమే మరి! నాలుగు రోజుల వరకు మీకు వాటి అవసరం కూడా రాకపోవటంవల్ల ఆ నోట్లు బ్యాంకు నించి తెచ్చినపుడు మారిపోయాయో ఈ నాలుగురోజుల వ్యవధిలో మారిపోయాయో తేల్చుకోవటం కష్టమే అవుతుంది....

దొంగలే అయితే డబ్బుతోపాటు బ్రీఫ్ ఎత్తుకు పోతారుగాని, జాగ్రత్తగా మీ పెట్టె తెరిచి ఆ నోట్లు తీసి దొంగనోట్లు ఆ స్థానంలో పెట్టాల్సిన అవసరంలేదు. దీన్నిబట్టి చూస్తే మిమ్మల్ని అపఖ్యాతిపాలు చెయ్యటానికి మిమ్మల్ని వీధిలోకి లాగటానికి కావాలనే ఎవరో చేసివుంటాలనిపిస్తోంది!"

"ఎగ్జాక్ట్లీ! నేనూ అదే అనుకుంటున్నాను సార్! నా శత్రువులెవరో నామీద కక్షతో యిలాచేసి వుండొచ్చు ననుకుంటున్నాను."

"మీ శత్రువు లెవరు? మీకూ శత్రువులున్నారా?"

"ఎందుకుండరు సార్! కొంతమంది వృత్తి శత్రువు అయితే మరికొందరు మరో కారణంవల్ల, మరొకరు అసూయవల్ల—యిలా నా చుట్టూ శత్రువులే!

"ఆ వివరాలు చెప్పండి. వాళ్ళ గురించి ఆరాతీస్తే ఏమన్నా ఫలితముంటొచ్చు....ఇంతకీ నేను మీకు చేయవలసిన సర్వీస్ ఏమిటో మీరు చెప్పనేలేదు.." అన్నాడు కిరణ్.

హరప్రసాద్ టేబిలుమీదకి వంగి, "ఇక వేరే చెప్పేదేముంది సార్! ఆ డబ్బు అలా మారిపోవటానికి కారకు డెవరో తెలుసుకోవాలి. ఎందుకలా చేశాడో కనుక్కోవాలి. వీలైతే నా డబ్బు నాకు అప్పగించాలి!" అన్నాడు.

"మనిషి దొరికితే డబ్బు దొరకటం కష్టంకాదు. అసలు అందుకు కారకుడెవరో తెలిస్తే అన్నీ వాటంతటవే బయటికొస్తాయి....ఆల్ రైట్! చెప్పండి వివరాలు!" పెన్ను నోట్ బుక్ సిద్ధంగా పెట్టుకున్నాడు కిరణ్.

హరప్రసాద్ చెప్పసాగాడు.

కిరణ్ వరసగా రాసుకున్నాడు. ఆ వ్యక్తులతో హరప్రసాద్‌కున్న పరిచయం, సంబంధం, ఆయనతో వున్న శత్రుత్వం వివరాలు అన్నీ విపులంగా అడిగి నోట్ చేసుకున్నాడు.

"త్వరలో ఈ విషయం కనుక్కోండి సార్! నాకో పక్క బెంగగా వుంది. నాకిది బాడ్ పిరియడ్‌లా కనిపిస్తోంది చూడగా....ఇదిగో అడ్వాన్స్‌గా వుంచండి!" అంటూ ఓ నోట్ల దొంతర టేబిల్ మీద పెట్టాడు.

కిరణ్ మెల్లగా నవ్వి, "సరే, మీరు వెళ్ళి రండి. అవసరమైతే నేనే మీ యింటికొచ్చి విశేషాలుంటే చెపుతాను" అన్నాడు.

హరప్రసాద్ సెలవుతీసుకుని వెళ్ళిపోయాడు.

2

కిరణ్ హరప్రసాద్ వెళ్ళిపోయాక కేసుని పరిశోధించాల్సిన విధానం గురించి ఎక్కడినుంచి మొదలు పెట్టాలో అని ఆలోచిస్తూండగా టెలిఫోన్ మోగింది. ఫోన్ ఎత్తి "హల్లో, ఎవరు కావాలి?" అన్నాడు కిరణ్.

అవతల కర్కశంగా వున్న గొంతు వినిపించింది.

"మిష్టర్ కిరణ్! ఈ నోట్ల కేసులో పరిశోధన విరమించుకో, లేకుంటే చాలా ప్రమాదం!" అన్న హెచ్చరిక విని నిటారుగా అయాడు కిరణ్.

"ఎవరు నువ్వు? నోట్లకేసేమిటి?"

"అదే సార్, ఇప్పుడే హరప్రసాద్ దగ్గర అడ్వాన్సు కూడా తీసుకున్నావు కదా! వాడో పరమ ద్రోహి, పాపాత్ముడు! వాడి సంగతి మేం చూసుకుంటాంగాని నువ్వనవసరంగా కలగజేసుకోకు."

"నువ్వెవరు? నన్ను శాసిస్తున్నావా?"

"నేనెవరో నీకు తెలియదు. చెప్పినా తెలియదు. శాసించటమే కాదు, అవసరమైతే మా లక్ష్య సాధనకి నిన్ను అడ్డు తొలగించుకోవటానికి ఏమైనా చేస్తాం. అందుకే మా దారికి అడ్డు రాకు! వెంటనే హరప్రసాద్ కేసు విరమించుకో."

"అది జరగని పని!"

"నీ ఖర్మ అనుభవిస్తావు!" అవతల గట్టిగా ఫోన్ పెట్టిన శబ్దం.

కిరణ్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఎవరో హరప్రసాద్‌ని వెంబడిరిచి వచ్చారు. తమ మధ్య నడిచిన సంభాషణ, తనకు అడ్వాన్సుకింద డబ్బివ్వటం అన్నీ చూశాడు, విన్నాడు.

కిరణ్ చటుక్కున సీట్లోంచి లేచి బయటికొచ్చాడు. తన గది బయట నడవా పరీక్షగా చూశాడు. నీట్‌గా వున్న ఫ్లోర్ మీద యిసక, దుమ్ము కనిపించాయి. తెల్లగా పడ్డ చెప్పుల గుర్తులు కూడా కనిపించాయి. తనింట్లోకి అంత చొరవగా ఎవరూ రారు. అదీగాక దొంగచాటుగా వచ్చే అవకాశం కూడా లేదు. గేటు దగ్గర గూర్ఖా వున్నాడు!

కిరణ్ చకచక గేటు దగ్గరకొచ్చాడు. ఆవరణలోని పూల మొక్కల మధ్యగా పడివున్న గూర్ఖా కనిపించాడు.

దగ్గరగా వెళ్ళి చూశాడు. స్పృహతప్పి పడివున్నాడు.

లేపిన వెంటనే లేవలేదు. నీళ్ళు చల్లి సేద తీర్చాక లేచి కూచున్నాడు. అతని తలమీద వున్న గాయం అప్పుడు కిరణ్ కళ్ళబడింది. అతను చెప్పనవసరం లేకుండానే జరిగింది అర్థమయ్యింది కిరణ్ కి.

గూర్ఖాను కొట్టి స్పృహ తప్పించి గేట్లోంచి లోపలికి ఎవరో వచ్చారు.

"కిత్ నే ఆద్మీ ఆగయేఁ?" అనడిగాడు కిరణ్.

"దో ఆద్మీ ఆయే సాబ్! మైఁ క్యా, హోనాపూఛ్ రహాహూఁ, బీచ్ మె ఏక్ ఆద్మీ జోర్ సే ముఝే మారా!" అంటూ వివరించాడు గూర్ఖా.

వాళ్ళ పోలికలు అడిగి గుర్తుపెట్టుకున్నాడు కిరణ్.

వాళ్ళెందుకు వచ్చినట్టు? కేవలం తమ మధ్య జరుగుతున్న సంభాషణ తెలుసుకోవటానికేనా? తమ యిద్దరో ఎవరికీ హాని చెయ్యకుండా వచ్చిన దారినే మళ్ళీ బయటికి దాటుకున్నారు. ఇంతకీ వాళ్ళ ఉద్దేశ్యమేమిటి? వాళ్ళకీ, వారప్రసాద్ కి, ఈ దొంగనోట్లకీ ఏమిటి సంబంధం?

ఆలోచిస్తూ కిరణ్ లోపల్నుంచి మెజరింగ్ టేప్ తెచ్చి నడవలో పడ్డ చెప్పుల గుర్తుల కొలతలు సేకరించాడు. తర్వాత వాటిని ఫోటో తీశాడు. మట్టిని సేకరించి భద్రపరిచాడు. సిగరెట్టుపీకల వంటివి కనిపిస్తాయేమోనని చూశాడు. అలాంటివేం కనిపించలేదు.

లోపలికొచ్చి నోట్ బుక్ లో రాసిన వ్యక్తుల వివరాలు పరిశీలనగా చూశాడు. అందులో నాలుగు పేర్లు అతన్నాకర్షించాయి.

ఒకతను—పేరు—రంగనాథ్ ఓ. సినిమా థియేటర్

యజమాని. వృత్తి శత్రువు! సంఘంలో హోదా, పేరు వున్నవాడే! హారప్రసాద్‌తో చాలాకాలంగా విరోధముందతనికి! అతను తీసుకోబోయిన థియేటర్లో షేర్ హారప్రసాద్ పోటీపడి కొన్నాడు. అదే శత్రుత్వానికి కారణం.

పారసారిధి. హారప్రసాద్ థియేటర్లో మేనేజర్‌గా పనిచేసి బాగా డబ్బు తినేసి హారప్రసాద్ చేత ఉద్యోగంనించి తొలగించబడ్డాడు. సహజంగా హారప్రసాద్ పట్ల కక్షబూనటం, దాన్నిలా సాధించుకోవాలనుకోవటం జరగొచ్చు. ఏ పనీ లేకపోతే ఇలా దొంగనోట్ల చలామణీలో పనిచేస్తూండవచ్చు. అతని విషయం ఆరాతీయాల్సింది వుంది!

పరశురామయ్య. ఇతను ఒకప్పుడు హారప్రసాద్‌తో వియ్యమందాలనుకున్నాడు. తన కూతుర్ని హారప్రసాద్ కొడుకు సత్యప్రసాద్‌కిచ్చి చెయ్యాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు. బాగా డబున్నవాడు. రెండు పెద్ద బట్టల షాపు లున్నాయతనికి.

నాలుగో వ్యక్తి పేరు కారయ్య. హారప్రసాద్ ఇంటి నౌఖరు. ఓసారి ఏదో సందర్భంలో పొగరుగా ప్రవర్తించాడని అల్లుడుగారు ఆరోపించగానే, హారప్రసాద్ వాడిపై ఆగ్రహించి పనిలోనుంచి తొలగించాడు. వాడు పనివాడయినా అవమానం సహించడనీ, ప్రతీకారం తీర్చుకు తీరతాడని తనకోపక్క భయంగానే వుందనీ వాడిపని కానిచ్చునేమోనని అనుమానం వెలిబుచ్చాడు హారప్రసాద్. ఇది జరిగి కూడా చారంరోజాలే అయింది.

ఇవిగాక యింకా మరో ఆరు పేర్లున్నాయి లిస్టులో.

కాని వాళ్ళకు హరప్రసాద్‌తో పెద్దగా శత్రుత్వంగాని, ప్రత్యేకంగా చెప్పుకోవాలసిన పగ, ప్రతీకారం, కక్ష లాంటి వేమీ లేవు. అంతగా అవసరమైతే వాళ్ళ గురించి కూడా ఎంక్వయిరీ చేయాలనుకున్నాడు కిరణ్.

ఇంతలో కిరణ్‌కి ఓ విషయం స్ఫురించింది.

హరప్రసాద్ రెండు లక్షల రూపాయల గురించి బెంగపడుతున్నట్టు కనిపించదు. అవి ఖచ్చితంగా రాబట్టుకోవాలనే ధోరణి అతని ప్రవర్తనలోగాని, మాటల్లోగాని తనకు అంతుపట్టలేదు. బహుశా కోటికి పడగలెత్తినందువల్లనో ఏమో! కేవలం తన పరువు మర్యాదల్ని రచ్చకీడ్చి, తన ఆస్తిపాస్తుల విషయం బయటికి లాగుతారనే ఎక్కువగా అతను దిగులుపడుతున్నట్టుంది అతని ధోరణి.

అసలు హరప్రసాద్ చెప్పిన విషయాలు నిజమేనా? అతను నమ్మదగ్గ వ్యక్తేనా? ఫోన్‌లో వ్యక్తి మాటలే అనుక్షణం గుర్తొస్తున్నాయి కిరణ్‌కి; ఆ వ్యక్తికి హరప్రసాద్ మీద చాలా కక్ష వున్నట్టుంది. అతను పాపాత్ముడని, లుచ్ఛా అనీ సంబోధించాడంటే ఏదో ముఖ్యమైన శత్రువు లాగానే వున్నాడు।

అతను తన యింటికొచ్చిన యిద్దరు వ్యక్తుల్లో ఒకడయి వుంటాడు. ఫోన్ చేస్తున్నప్పుడు రెండోవాడు పక్కనే వుండివుండాలి. హరప్రసాద్ బయటికి వచ్చే సమయానికి వాళ్ళు అతని కంట పడకుండా తనింటినుంచి బయటపడి ఏ పబ్లిక్ బూత్‌నుంచో ఫోన్ చేసి తనని బెదిరించారు.

కిరణ్ లేచాడు. చకచక దుస్తులు మార్చుకుని పోర్టికోనుంచి టయోటాని బయటికి తీశాడు. హరప్రసాద్ యిచ్చిన అడ్రసు ఓసారి మననం చేసుకున్నాడు.

సరాసరి టయోటాను ముందుకు హరప్రసాద్ ఇంటి వైపు—పరుగెత్తించాడు.

దూరంనుంచే మూడంతస్తుల అధునాతనమైన భవనం చూచేవాళ్ళ కళ్ళు చెదరగొడుతూ కనిపించింది. దాన్ని కట్టడానికి కనీసం పాతిక ముప్పయి లక్షలు ఖర్చుపెట్టి వుంటాడు హరప్రసాద్.

ఇంటిముందు ఆగకుండా కారు స్లో చేసి గేటుముందున్న చలవరాయి పలకమీద 'సౌజన్య విహార్' అన్నమాటలు ఓ పక్క, హరప్రసాద్ లాండ్ లార్డు, అన్న మాటలు రెండో పక్క చదివాడు కిరణ్. దీన్నిబట్టి హరప్రసాద్ చెప్పిన మాటలు ఏమాత్రం సత్యదూరం కాదన్న విషయం తెలిసిపోతూనే వుంది.

3

సాయంత్రం ఆరుగంటల సమయం. రోడ్లన్నీ రద్దీగా వున్నాయి. అది మెయిన్ రోడ్ కావడంతో షాపింగ్ సెంటర్లన్నీ జనంతో కిటకిటలాడుతున్నాయి.

కిరణ్ తన పరిశోధన కార్యంతో మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నాడు. కారుని ఊరికి చివరగా వున్న స్లమ్ ఏరియాకు పోనిచ్చాడు. అక్కడ కూలీపనులు చేసుకునేవాళ్ళు ఫ్యాక్టరీల్లో పనిచేసేవాళ్ళు, కాయకష్టం చేసుకునేవాళ్ళు నివసిస్తూంటారు.

కారయ్య ఆ లొకాలిటీలోనే వుంటున్నాడు.

కిరణ్ టయోటాని ఆ వైపు పోనిస్తున్నాడు. ఎక్కడ్నుంచో ఓ చెవర్లెట్ కారు అక్కడికి దూసుకుంటూ వచ్చింది.

ఆ ప్రదేశంలో జనం బాగా పల్చగా వున్నారు.

చెవర్లెట్ టయోటాకు అడ్డంగా పెట్టేశారు. అందు లోంచి చకచక నలుగురు వ్యక్తులు దిగారు.

టయోటాను చుట్టుముట్టారు.

కిరణ్ రాబోయే ప్రమాదాన్ని ఊహించాడు. చటుక్కున కోటు జేబులోనించి పిస్తోలు తియ్యబోయాడు-కాని అప్పటికే ఆలస్యమయింది.

అందులో దృఢంగా పొడవుగా వున్న పిల్లిగడ్డం వ్యక్తి చేతిలో నల్లగా నిగనిగ మెరుస్తోంది రివాల్వర్ అప్పటికే!

"మేము చెప్పినట్టు విన్నావా సరే, లేకపోతే నిర్దాక్షిణ్యంగా చంపి పారేస్తాం" అన్నాడు.

కింద దవడ కండరాలు బిగుసుకున్నాయి.

"ఎవరు మీరు? ఏమిటీ దౌర్జన్యం" అన్నాడు.

"అవన్నీ తర్వాత. నువ్వు మర్యాదగా పక్క సీట్లోకి జరుగు. నేను డ్రైవ్ చేస్తాను" అని ఆ పిల్లిగడ్డం వ్యక్తి తనవాళ్ళవంక చూసి సైగ చేశాడు.

అప్పటికే కొన్ని చెక్క పెట్టెలు టయోటా డిక్కీలోకి చెవర్లెట్ నుంచి చేరవేశారు తక్కిన ముగ్గురు. ఇద్దరు చెవర్లెట్ ఎక్కి ఎటో వేగంగా మాసుకుపోయారు. ఒకడు టయోటా వెనక సీట్లో కూచున్నాడు.

కిరణ్ మౌనంగా పక్కకు జరిగాడు.

పిల్లిగడ్డం మనిషి అంతలోనే యేమనుకున్నాడో, "వద్దులే నువ్వే డ్రైవ్ చెయ్యి. డైరెక్షన్స్ నేను చెబుతాను" అన్నాడు.

"నేను డ్రైవ్ చెయ్యను" అన్నాడు కిరణ్ మొండిగా.

"మిస్టర్ కిరణ్! నువ్వు చాలా తెలివైనవాడివి. నీ సేవలు ఈ దేశానికి చాలా అవసరం. యెందుకు అనవస

రంగా ప్రాణం పోగొట్టుకుంటావు?" అన్నాడు పిల్లి గడ్డం వ్యక్తి.

కిరణ్ అతనితో వాదిస్తూనే తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. వాళ్ళిద్దరున్నారు. తను ఒక్కడే అయినా రివాల్వర్ చేతికి అందుకునే అవకాశం యివ్వకుండా పిస్తోలు గురిపెట్టి వున్నాడా వ్యక్తి.

వీళ్ళెవరు? ఆ పెట్టెల్లో ఏమున్నాయి? తన కార్లోకి ఎందుకు చేరవేశారు? — అని మరో పక్క ఆలోచిస్తున్నాడు.

రివాల్వర్ గొంతని గట్టిగా కిరణ్ డొక్కలో గుచ్చాడా వ్యక్తి.

"నువ్వు కావాలని నాతో వాదన పెట్టుకుని ఆలస్యం చేస్తున్నావు. వెంటనే కారుని బయల్దేరతియ్యి-లేకపోతే చంపటానికేమాత్రం సంకోచించను. యిక్కడ నిన్ను రక్షించేవారుగాని, నన్ను అడ్డుకునేవారుగాని యెవరూ లేరు. ఆ కూలి జనం అలాగా జనం మన కార్ల మనుషుల సంగతులు పట్టించుకోరు. ఎవడో నీకు సాయంవస్తాడని, మానించి తప్పించుకోవాలని ప్రయత్నించకు. ఊఁ. క్విక్!" అన్నాడు.

కిరణ్ కారు స్టార్టు చేశాడు.

"ఊఁ, వేగంగా పోనీయ్! జి.ఎన్.టి. రోడ్‌కి కారు తిప్పు. తిన్నగా పోనియ్యి. దార్లో ఎవరు అడ్డొచ్చినా కారు ఆపకు. ఆపాలని ప్రయత్నించినా, దారి మళ్ళించాలని ప్రయత్నించినా అనవసరంగా నష్టపోతావు" అన్నాడా వ్యక్తి హెచ్చరిస్తూ.

కిరణ్ కారు పోనిస్తున్నాడు.

జి.ఎన్.టి. రోడ్డు చాలా రద్దీగా వుంది. లారీలు

చాలా విస్తారంగా నడుస్తాయి ఆ దారిన. చీకటిపడింది. హెడ్ లైట్స్ ఆన్ చేశాడు కిరణ్. తల తిప్పటాని కూడా వీల్లేదు-పిల్లిగడ్డంవాడు తన డొక్కమీదినుంచి రివాల్వర్ని ఒక్క అంగుళం కూడా సడలించటంలేదు.

రోడ్డు మలుపు తిరిగేచోట పోలీసు వేన్, జీపు రోడ్డుకి అడ్డంగా పెట్టబడి వున్నాయి.

కిరణ్ కళ్ళు మెరిశాయి. జీప్లో కూచుని వున్న ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ అతనికి స్పష్టంగా కనిపిస్తు న్నాడు.

పిల్లిగడ్డం రివాల్వర్ని మరింత గట్టిగా బిగించి, "పిచ్చి వేషాలు వెయ్యటానికి ప్రయత్నించకు. రోడ్ బ్లాకయి పోయింది కాబట్టి ఆపు చెయ్యక తప్పదు. అతను ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్. నీ ఫ్రెండు. నీ కారు సాధారణంగా ఆపడు. అడిగితే ఏదో చెప్పెయ్యి" అంటుండగానే టయోటా జీపు వేను వున్న ప్రదేశం చేరింది.

శ్రీనివాస్తో బాటు నలుగురు కానిస్టేబుల్స్ ఆయు ధాలు టయోటాకి గురిచేసి నించున్నారు. ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ టయోటాని సమీపించాడు.

డ్రైవింగ్ సీట్లో వున్న కిరణ్ని చూడగానే అతని ముఖం సంతోషంగా వెలిగింది. "హల్లో బ్రదర్, ఏమిటీ సర్ప్రయిజ్! ఇలా ఎక్కడికి బయల్దేరావు?" అన్నాడు శ్రీనివాస్ రివాల్వర్ కేస్లో పెట్టేస్తూ.

పోలీసులు గన్స్ వాల్చేశారు.

కిరణ్ బలవంతాన నవ్వి, "ఓ కేసు విషయంలో చిన్న యిన్ఫర్మేషన్ కావలసి వచ్చి దగ్గర్లో వున్న ఓ గ్రామానికి వెళ్తున్నాను. నువ్వేమిటి యిక్కడున్నావు? ఏదైనా రైడింగా?" అన్నాడు.

"అవును. నిన్ను కలుద్దామనుకున్నాను. కాని యింత లోనే అర్జంటుగా ఫోన్ మెసేజ్ వచ్చింది. ఈ రోజున ఓ. చెవర్లెట్ కార్లో దొంగనోట్లు రవాణా అవుతున్నా యని విశ్వసనీయంగా తెలిసింది. అందుకని కాచుకుని వున్నాను. అవును, యింకా కార్లో ఎవరో వున్నట్టుంది, ఎవరు వాళ్ళు?" అన్నాడు కిరణ్.

కిరణ్ వెంటనే, "చెప్పానుకదా ఓ. కేసు విష యంలో వెళ్తున్నానని. నా క్లయింట్సు వివరాలు నీకు తర్వాత చెప్తాను" అన్నాడు.

కిరణ్ కి తన డిక్కీలో వున్న చెక్కపెట్టెలేమిటో అర్థమయింది. దుండగుల ప్రయత్నం కూడా తెలిసింది. తను కావాలంటే ఈ క్షణంలోనే వాళ్ళిద్దర్నీ పోలీసుల కప్పచెప్పెయ్యగలడు! శ్రీనివాస్ కి కన్ను గీటాడంటే చాలు క్షణంలో వాళ్ళిద్దరి పనీ సమాప్తమవుతుంది.

కాని ఇప్పుడు తను తొందరపడకూడదు. వీళ్ళు దొంగ నోట్లు చలామణీ చేస్తున్న స్మగ్లర్సు. వీళ్ళు ఈ నోట్లు ఎక్కడికి చేరవేస్తున్నారో, వీళ్ళ అసలు స్థావరమెక్కడో తెలుసుకోవటం చాలా అవసరం! వీళ్ళిద్దర్నీ పట్టి బంధించి హింసించినా తక్కిన వాళ్ళ గురించి చచ్చినా చెప్పరు. తనే స్వయంగా తెలుసుకోవటానికి యిది చక్కని అవ కాశం!

"సరే, వెళ్ళు. మనం మళ్ళీ కలుద్దాం. నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి దొంగనోట్లు చలామణి గురించి. మళ్ళీ ఎప్పుడొస్తావు? రాత్రికొచ్చేస్తావా?"

"బహుశా వచ్చేస్తాను. రేపు కలుద్దాం" అన్నాడు కిరణ్. శ్రీనివాస్ స్నేహపూర్వకంగా నవ్వాడు.

వేన్, జీపు అప్పటికే రోడ్ కి అడ్డుతీసి పక్కకు

పెట్టారు.

కిరణ్ టయోటా స్టార్టు చేసి ముందుకు పోనిచ్చాడు.

4

“గుడ్! సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలు కాపాడుకోవటమే కాక, మా ఆస్థి కాపాడావు. థాంక్స్! ఎంతైనా డిటెక్టివ్ బుర్ర పాదరసంలా పని చేస్తోంది!” అన్నాడు పిల్లిగడ్డం వ్యక్తి.

“నీ ప్రశంసలు నాకొద్దు. ఆ పెట్టెల్లోని దొంగనోట్లు ఎక్కడికి సరఫరా చేస్తున్నావు?”

“అవన్నీ నీ కనవసరం. ఎవడో మా సంగతి పోలీసులకి చెప్పేశాడు. అందుకే అప్పటికప్పుడు చెవర్లెట్ నించి సరుకు నీ కార్లోకి మార్చేశాం. నిన్ను మా వెంట ఎందుకు తీసుకు వస్తున్నామో తెలుసా? దార్లో ఎక్కడ పోలీసులు ఎదురైనా నువ్వు డిటెక్టివ్వి కాబట్టి వది-లేస్తారు. మా గురించి ఎవరూ పట్టించుకోరు. గుర్తుపట్టరు. రోజుకి వేషాలు ఎన్ని వేస్తామో మాకే తెలియదు. అంచేత వాళ్ళు గుర్తుపట్టే అవకాశం లేదు.”

కిరణ్ చటుక్కున పిల్లిగడ్డం వాళ్ళవైపు చూశాడు. కాళ్ళకి షూస్ వున్నాయి. తన యింటివద్ద దొరికినవి చెప్పుల గుర్తులు. షూస్‌వి కావు. పైగా ఇతని కాలు బాగా చిన్నగా వుంది—షూ వేసుకున్నా తన యింట్లో దొరికిన గుర్తులు తొమ్మిదంగుళాలున్నాయి. ఇతను కాదు-అనుకున్నాడు మనసులో.

“పోలీసులకి తెలిసిపోయిందని నీకు తెలిసినపుడు రవాణా చేయటం మానెయ్యొచ్చుకదా! అంత అర్జంటుగా ఎందుకు నా కార్లో చేరవెయ్యాలి?”

“అవన్నీ నీ కనవసరమన్నానుకదా....” అని పిల్లి

గడ్డం వ్యక్తి ఏదో అంటుండగానే వెనక సైరన్ మోగిన శబ్దం. వేన్, జీపు వేగంగా దూసుకొస్తున్నాయి.

వెనక కూచున్న వ్యక్తి, "గురూజీ, పోలీసులు పసికట్టేశారు. వెనకపడి తరుముతున్నారు" అన్నాడు.

పిల్లిగడ్డం వ్యక్తి వెనక్కి చూసి కంగారుగా, "వెంటనే ఈ పక్కకు జరుగు. నేను డ్రయివ్ చేస్తాను" అన్నాడు.

ఆ క్షణాన్ని వెంటనే సద్వినియోగం చేసుకోవాలనుకున్నాడు కిరణ్. స్టీరింగు అందుకోవటానికి పిల్లిగడ్డం వ్యక్తి రివాల్వర్ చెయ్యి మార్చుకున్నాడు. సరిగ్గా అదే సమయంలో తన కోటు జేబులోనించి రివాల్వర్ తీయబోయాడు కిరణ్.

కాని అప్పటికే ఆలస్యమయి పోయింది.

వెనకసీట్లో వ్యక్తి చేతిలో కూడా రివాల్వర్ వుంది. దాని మడమతో కిరణ్ నెత్తిమీద బలంగా కొట్టి తలుపు తీసి బయటకి తోసేశాడు కిరణ్ ని.

వేగంగా పరుగెత్తుతున్న కార్లోంచి అమాంతం రోడ్ మీద పడిపోయాడు కిరణ్.

వెనక వస్తూన్న జీప్, వేన్ కిరణ్ ని చూడగానే ఆగుతాయనీ, ఆ కాస్త సమయంలోను తాము దొరక్కుండా తప్పించుకోవచ్చనీ వెనక సీట్లోని వ్యక్తి ఊహించాడు.

సరిగ్గా అదే జరిగింది.

వేన్, జీవు కిరణ్ బయటికి పడిపోవటంచూసి ఆగిపోయాయి. బిలబిలమంటూ పోలీసులు శ్రీనివాస్ తో బాటు దిగి కిరణ్ దగ్గరికి పరుగెత్తుతున్నారు.

"వెల్ డన్ మై బోయ్!" అన్నాడు పిల్లిగడ్డం వ్యక్తి

తన అనుచరుడితో ప్రశంసగా.

• • •

శ్రీనివాస్ కిరణ్‌ని లేపి కూచోబెట్టాడు. మోకాళ్ళ మోచేతులు బాగా కొట్టుకుపోయాయి. పాంటు మోకాళ్ళ దగ్గర చినిగిపోయింది. కోటు మోచేతుల దగ్గర చిల్లులు పడిపోయింది.

తల చిట్లి నెత్తురు స్రవిస్తోంది.

"ఎవరు వాళ్ళు? నువ్వు వాళ్ళకెలా లొంగిపోయావు?" అడగబోయాడు శ్రీనివాస్.

"ఆ విషయం తర్వాత. వాళ్ళు స్మగ్లర్సు. తప్పించుకు పోనివ్వకు. పద వెంటాడు" అన్నాడు కిరణ్ లేని ఓపిక తెచ్చుకుని.

చేతులమీద ఆపుకున్నాడుగాని లేకుంటే తల రోడ్‌కి కొట్టుకుని ప్రాణంపోయి వుండేది.

శ్రీనివాస్ ఎగిరి కూచున్నాడు జీపులో. కిరణ్‌ని యిద్దరు కానిస్టేబిల్సు వేన్‌లోకి ఎక్కించారు. జీపు వెనక వేన్ పరిగెడుతోంది.

కిరణ్ టెన్షన్‌తో రోడ్‌వంకే చూస్తున్నాడు.

అప్పటికే టయోటా పూర్తిగా కనుమరుగైపోయింది. దాన్ని తను ప్రత్యేకంగా బుల్లెట్ ప్రూఫ్ చేయించాడు. మొన్ననే సర్వీసింగ్ చేయించాడు. మంచి కండిషన్‌లో వుంది. ఆ స్పీడును జీప్ అందుకోవటం జరగని పని!

వాళ్ళు తప్పించుకు పోయినందుకు ఉసూరుమనిపించింది కిరణ్‌కి. చేతులారా తనే అవకాశాన్ని జారవిడుచుకున్నాననిపించిందతనికి. దొరికిన వాళ్ళని వదిలి యింకా మొత్తం ముఠాని బంధించాలనుకోవటం పొరపాటయిందా అనిపించిందో క్షణం.

జీప్ ఆపేసి, వైర్‌లెస్‌లో చకచక ముందున్న పోలీస్ స్టేషన్స్‌కి మెసేజ్ పంపిస్తున్నాడు శ్రీనివాస్.

కిరణ్ దగ్గరికి రాగానే "నువ్వు హైదరాబాద్ తిరిగి వెళ్ళిపో! నీకు వైద్య సహుపాయం చాలా అవసరం. రక్తం కూడా పోతోంది. నేను ముందుకి వెళ్తాను. ఈలోపల నా మెసేజ్ అందుకుని సూర్యాపేటలోనో యీ లోపలనో మనవాళ్ళు టయోటాను ఆపేస్తారు. వాళ్ళు తప్పించుకోలేరు."

"ఏం ఫరవాలేదు. ముందుకే పోనియ్యి. నేనూ నీతోనే వస్తాను. వాళ్ళను వదిలిపెట్టేదిలేదు. జీప్ ఎందుకు ఆపు చేశావు?"

"ఇంక వాళ్ళనెటూ పట్టుకోలేను. నిన్నయినా వెనక్కి పంపిద్దామని ఆగాను."

"మనం కాకపోయినా సూర్యాపేట పోలీసులైనా పట్టుకుంటారుకదా! ఈలోపల మనమూ స్పాట్‌కి చేరుకోవచ్చు. ఊఁ, క్విక్!" అన్నాడు కిరణ్.

అంత బాధాకర పీతిలో వుండికూడా తనను ఎంకరేజ్ చేస్తున్న కిరణ్‌ని చూసి జాలిపడ్డాడు శ్రీనివాస్.

మరో అరగంట ప్రయాణం తర్వాత దూరంగా టయోటా కనిపించింది.

శ్రీనివాస్ జీప్ వేగం పుంజుకుంది.

అయిదు నిమిషాల్లో టయోటాని అందుకున్నారు.

టయోటా రోడ్ పక్కగా ఆగివుంది. పోలీసులు చుట్టుముట్టారు.

శ్రీనవాస్ లోపలికి తొంగి చూశాడు.

టాయోటాలో ప్రయాణించిన వ్యక్తులు లేరు! నంబరు చూశాడు. కిరణ్‌దే!

"డిక్కీలో చూడు" అన్నాడు కిరణ్.

డిక్కీ తెరిచి చూశారు. అందులోని చెక్క పెట్టెలు మాయమయ్యాయి.

"చాలా తెలివిగా తప్పించుకున్నారు" ఉస్సురన్నాడు శ్రీనివాస్.

అక్కడ దారి మూడుగా చీలిపోయింది. ఒకటి అడవిదారి. ఒకటి సూర్యాపేట, మరొకటి ఖమ్మంపోయే దారి "వాళ్ళు ఏ దారిన ఎక్కడికి తప్పించుకున్నారో, ఏ వాహనంమీద తప్పించుకున్నారో ఎలా తెలుస్తుంది? మెసేజ్ పంపించే అవకాశంలేదు. నేను టయోటా అని చెప్పాను" అన్నాడు శ్రీనివాస్.

"ఈ మూడు దార్లలోను ఏ వాహనం వెళ్ళినా ఆపు చేయించి చెక్ చెయ్యమని మళ్ళీ మెసేజ్ పంపు. వాళ్ళు ఏదైనా వాహనంమీద వెళ్తే మాత్రం తప్పకుండా దొరికిపోతారు" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ వెంటనే మెసేజెస్ పంపాడు. ఇన్ఫర్మేషన్ దొరికితే హైద్రాబాద్ హెడ్‌క్వార్టర్స్‌కి తెలియ చెయ్యమని చెప్పాడు.

టయోటా, జీప్, వేన్ వెనక్కి హైద్రాబాద్ దారి పట్టాయి.

5

"నాతో తమకేం పనిబాబూ?" అన్నాడు కాశయ్య. అతనికి దాదాపు నలభై అయిదేళ్ళుంటాయి. కాయ కష్టంతో రాటుదేలిన శరీరం మనిషి. చదువుకోలేదు. మోటుగా వున్నాడు.

"మరేంలేదు, నాకు కొన్ని వివరాలు కావాలి. నీ ఋణం వుంచుకోనులే!" ఏభైరూపాయల కాగితం అతని

చేతిలో పెట్టాడు కిరణ్.

"అబ్బే, ఎందుకండి బాబూ, అడగండి చెబుతాను" అన్నాడు శారయ్య. నోటు ముట్టుకోలేదు. అతని నిజాయితీ కళ్ళలో ప్రతిఫలిస్తోంది.

"ఫరవాలేదు శారయ్యా, తీసుకో! నా సంతోషం కొద్దీ యిస్తున్నాను. డబ్బిస్తేనే గాని చెప్పవని కాదు" అని కిరణ్ బలవంతాన అతని గుప్పెట్లో పెట్టాడు నోటు.

శారయ్య అడగమన్నట్టు చూశాడు.

"గతంలో నువ్వు హరప్రసాద్ గారింట్లో పని చేశావు కదూ...."

"అవును బాబూ, నిన్న మొన్నటివరకు ఆరింట్లోనే ఆళ్ళ ఉప్పు పులుసు తిని ఈ శరీరం పెంచాను" కృతజ్ఞత తొణికిసలాడింది శారయ్య మాటల్లో.

"మరి ఎందుకు మానేశావు?"

"నేనెందుకు మానేస్తాను బాబూ, ఆరే మానిపించేసేరు."

"ఆరే అంటే హరప్రసాద్ గారేనా?"

"ఆరే బాబూ! కాని అయ్యగోరు దేవుడులాటోడు బాబూ! ఆరి అల్లుడిగారి మూలాన్న అంతా వొచ్చింది."

"ఏం, అల్లుడుగారు మంచివాడు కాదా?"

"ఏం మంచో బాబూ! ఇల్లరికం వొచ్చి వున్న అల్లుడుగదా ఎంత ఒద్దికగా వుండాలి? అదేంలేదు. ఓ పక్క అమ్మాయిగారు అడిగినంతా యిత్తానే వుంటారు. అయినా అదంతా ఆయనగోరి తాగుడికే చాలదు బాబు! యిరవై నాలుగ్గంటలూ మత్తులోనే వుంటాడు. పనా, పాటా? తీరి కూకుని తింటమే కదూ!"

"మీ చినబాబు ఎలాంటివాడు?"

"సత్తెపెసాదుగారా? ఆరికేశవండీ, మానిక్యం గదండీ! ఆ పల్లెటూళ్ళో యెగసాయం సేసుకుంటూ దరిజాగా వున్నారండి. అయ్యగోరి పేరు నిలబెట్టి తీర్తాడండి చినబాబు!"

"ఎప్పుడైనా బస్తీ వస్తుంటాడా?"

"అయ్! నెలకోసారి చిన్నమ్మగార్ని తీసుకొని వొత్తుంటారండి! ఓ రెండు రోజులుండి ఎలిపోతారండి."

"సరే, అల్లుడిగారి సంగతి చెపుతూ మధ్యలో మానేశావు? ఆయనకు తాగుడు ఒకటేనా, యింకా ఏమైనా అలవాట్లున్నాయా?"

"తాగుడికి అలవాటుపడ్డాక ఒకటేమిటి బాబయ్యా ఎన్నో అలవాటవుతాయండి, రేసులకెల్తారండి మలక్ పేట. పేకాట కబ్బుల్లో యీయనగారేనండి, ఏదైనా పందేలుగట్రా జరిగితే అక్కడ యీనగారేనండి."

"ఆయన పేరేమిటి?"

"పేరు మంచిదేనండి, అశోకబాబండి."

"అసలు నిన్ను పనిలోనుంచి ఎందుకు తీసేశారు?"

"అదే సెప్పటం మరిసానండి బాబయ్యా. నేను ఆ యింట్లో పదేళ్ళుగా పనిజేత్తన్నానండి బాబూ నేనా ఇంట్లో చేరేసరికి అబ్బాయిగారికీ అమ్మాయిగారికీ ఇంకా పెళ్ళిల్లే కాలేదండి. అమ్మాయిగారి పెళ్ళయినంక అల్లుడు గారొచ్చినంక నా పనులన్నింటికీ ఏదో వొంక పెడ్తుండేవోరండి. నన్ను పెద్దయ్యగారే అరే, ఒరే అనరుగాని ఈయనగారు ఒరే కారిగా అని పిలిసేవోరండి. పేదోడ్నయినా నాకూ అభిమానముండదాండి. సయించానండి.

"సరింగా వోరంరోజులకిత్తం ఆయనగారు ఓ కాని పని జేసాడండి. జేత్తా నా కల్లబడిపోయాడు. ఉత్తినే

నాతో గొడవపెట్టుకుని నేను పొగరుగా తన మీది మీది కొచ్చి కొట్టబోయానని అమ్మాయిగారికి పెద్దయ్యగోరికి లేనిపోనియ్యి జెప్పాడండి. ఎప్పుడూ కోపంరాని అయ్య గోరి కోపమొచ్చిందండి. నేను నిజం జెప్పేదామను కున్నానండి, కాని పోయేది ఆ యింటి పరువేనని జెప్ప లేదండి. అయ్యగోరు కోపగించి నన్ను పన్లోంచి తీసేసా రండి. నన్ను తీసియ్యకపోతే అల్లుడుగోరు యింట్లోంచి పోతానని బెదిరించారండి."

"ఇంతకీ ఆ కాని పనేమిటో చెప్పావుకాదు!"

"పోనీయండి బాబూ, పెద్దోళ్ళు ఎలాపోతే మన కెందుకు? అయ్యగోరికి అందుకే చెప్పలేదు."

"నాతో చెప్పితే నష్టంలేదు, చెప్పు!"

"అల్లుడుగోరు దొంగతనం చేశారండి."

"దొంగతనమా?"

"అవునండయ్యా. అప్పుడే పెద్దయ్యగోరు బాంక్ నించి డబ్బు తెచ్చిపెట్టి పరుపుమీదెట్టి, బాతురూంలో కెళ్ళారండి. సరిగ్గా అదే టయానికి అల్లుడుగారొచ్చి పెట్లోంచి డబ్బు తీసేరండి. సరిగ్గా నేను ఏదో పనుండి ఆ గదిలోకి వచ్చానండి. నన్ను జూసి మళ్ళీ డబ్బు పెట్లో పెట్టేసి అరిజెంటుగా ఎల్లిపోయారండి."

"అప్పుడు ఆయన చేతిలో యేదైనా సంచిగాని పెట్టె గాని వుందా?"

"లేదండి. ఆఁ....భుజంమీద తుండుందండి. దాన్ని ఒంటిమీద కప్పుకుని ఆడావిడిగా ఎల్లిపోయారండి."

కిరన్ మస్తిష్కంలో మెరుపులు మెరిశాయి.

కేసుకి కొస అందింది.

"చాలా సంతోషం కారయ్యా! ఇదిగో ఈ యాభై

కూడా వుంచు" మరో యాభై నోటు కారయ్య వద్దంటున్నా బలవంతాన అతని గుప్పెట్లో నొక్కాడు.

"ఇంతకీ ఈ సంగతులన్నీ ఎందుకడిగినట్టు బాబయ్యా, మీరడగ్గానే నాకు తోసిందంతా చెప్పేశాను. అల్లుడు గారు దొంగతనం సేసినట్టు ఎక్కడా సెప్పకూడదనుకున్నాను. అయ్యగోరు పిలిపిస్తే మళ్ళీ ఆరి పంచన పంజేసుకు బతకాలనుంది."

"త్వరలో మీ అయ్యగారికి చెప్పి నీకు ఆ యింట్లో పనిప్పిస్తానులే. నేను మీ అయ్యగారి స్నేహితుడ్ని. ఆయన నీ గురించి చెప్పి నాతో బాధపడ్డాడు. నిన్ను అనవసరంగా పనిలోనుంచి తీసేశానని, నువ్వొస్తే పనిలో పెట్టుకుంటాననీ నాతో అన్నాడాయన."

కారయ్య ముఖంలో వేయి జ్యోతులు వెలిగాయి.

"అలాగాండి! అందుకా తమరొచ్చింది? అయితే వెంటనే ఎల్లి అయ్యగోరిని కల్సుకుంటానండి."

"కంగారొద్దు. త్వరలో మీ అయ్యగోరు అమ్మాయి గోరికి కూడా ఆస్థి పంచేసి వాళ్ళిద్దర్నీ వేరు కాపురం పెట్టిస్తారట. అప్పుడు మీ అయ్యగారు ఒక్కరే వుంటారు కదా. అప్పుడు నిన్ను పిలిపించుకుంటాడట. ఆ సంగతి నీకు చెప్పిరమ్మని పంపారు. నువ్వు తొందరపడి మీ అయ్యగారిని కలవకు, నేనే యెప్పుడు రావాలో మళ్ళీ వచ్చి చెపుతాను."

"సాలా సంతోసం బాబూ! ఈ పేదవాడిమీద దయ తలిసి నన్ను ఎతుక్కుంటూ వచ్చారన్నమాట."

"ఈ వందరూపాయలు కూడా మీ అయ్యగారే ఇచ్చారు. సరాసరి యిస్తే నువ్వు తీసుకోవని యిలా ప్రశ్నలు అడిగి బహుమానంగా ఇచ్చినట్టు యిచ్చాను."

"అలాగా బాబయ్యా! మా అయ్యగోరిది యెంత దొడ్డ మనసో నాకు తెల్సు బాబూ! ఉంటానండయ్యా!"

"ఆ, వస్తాను" అంటూ కిరణ్ లేచి టయోటా దగ్గరికొచ్చాడు. యెలాగైనా హరప్రసాద్ కి చెప్పి కారయ్యకు పనిప్పించాలి. తను చెప్పిన మాట అబద్ధం కాకూడదు అనుకున్నాడు.

6

"రండి సార్, ఏదయినా వివరాలు తెలిశాయా?" హరప్రసాద్ ఆత్రంగా అడిగాడు.

"ఇంకా లేదండి. పరిశోధన చేస్తున్నాను. ఓసారి మిమ్మల్ని కలసిపోదామని వచ్చాను" అన్నాడు కిరణ్.

"అలాగా! కూచోండి. మా యిల్లు చూస్తారా?"

"బయటికే తెలుస్తోంది మీ యింటి వైభవం. ఓసారి మీ ఇంటి సభ్యులని పరిచయం చేసుకోవాలనుకుంటున్నాను."

"దానికేమండి. అమ్మాయి, అల్లుడు, నేను, ఓనౌకరు, వాచ్ మన్. మొత్తం అయిదుగురమే ఈ పెద్ద భవంతిలో బతికేవాళ్ళం. అందుకే ఒంటరితనం భరించలేక అమ్మాయిని, అల్లుడ్ని యింట్లో పెట్టుకున్నాను."

ఇంతలో అటుగా ఓ యిరవై రెండేళ్ళ యువతి వచ్చింది.

హరప్రసాద్ ఆమెని చూపించి "ఈమె నా కూతురు జయప్రద.... అమ్మా వీరు డిటెక్టివ్ కిరణ్ గారు" అంటూ పరిచయాలు చేశాడు.

నమస్కార ప్రతి నమస్కారాల తర్వాత, "అల్లుడు గారు యింట్లోనే వున్నారు. పిలిపిస్తాను" అన్నాడు హరప్రసాద్.

"ఇక్కడికెందుకులెండి. నేనే వెళ్ళి మాట్లాడతాను. గది చూపించండి" అన్నాడు కిరణ్ లేస్తూ.

"అమ్మా, అల్లుడుగార్ని చూపించు" అన్నాడు కూతురితో.

జయప్రద కిరణ్‌ని వెంటబెట్టుకుని వెళ్ళింది.

పోతపోసిన విగ్రహంలో సోఫాలో కాళ్ళు నిగిడ్చి కూచుని వున్న వ్యక్తిని తన భర్తగా పరిచయం చేసి, "కూచోండి. కాఫీ తెస్తాను" అంటూ వెళ్ళిపోయింది జయప్రద.

విగ్రహానికి కదలిక వచ్చినట్టు, అతను బలవంతాన తల తిప్పి కిరణ్ వంక చూశాడు. వయసు ముప్పయి సంవత్సరాలలోపే అయినా భారీ శరీరం కావటంవల్ల ఓ పదేళ్ళు పెద్దగానే కనిపిస్తున్నాడు.

"మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి!" అన్నాడు కిరణ్ సూటిగా.

"నాతో ఏం మాట్లాడతారు? మా మావగారితో మాట్లాడండి" అన్నాడతను నిర్లక్ష్యంగా. మాట్లాడుతుంటే ఖరీదైన బ్రాందీ వాసన గుప్పుమంది.

కిరణ్ ముక్కు నలుపుకుని, "మరేంలేదు. మీ మామగారితో మాట్లాడే విషయమైతే అలాగే చేద్దును. కాని యిది మీ స్వవిషయం, డబ్బు విషయం, దొంగనోట్ల విషయం! పైవాళ్ళకెలా చెప్పను?" అన్నాడు.

అశోక్‌బాబు నిటారుగా కూచున్నాడు.

"ఏమిటి మీరంటున్నది?"

"నాకు శారయ్య అంతా చెప్పాడు. మీరు బుకాయించటానికి ప్రయత్నించవద్దు. దొంగలించిన రెండు లక్షలు ఏం చేశారు?"

"నీ నేమిటి, దొంగిలించటమేమిటి? ఆ శారయ్యగాడు చెప్పటమేమిటి? మీకేమైనా మతిపోయిందా?"

"నాకేం కాదు. పోలీసులకి మీ దొంగనోట్ల వ్యవహారం చెపితే అప్పుడు మీకు నిజంగా పిచ్చెత్తుతుంది."

అశోక్ కొంచెం తగ్గాడు. ఏం మాట్లాడలేదు.

"ఇప్పటిదాకా మీ మామగారిముందు మీ పరువు ఉజ్వలంగా వెలిగిపోతోంది. జరిగిన విషయం చెపితే ఆయన తక్షణం మిమ్మల్ని నడివీధిలోకి గెంటడమే కాదు, పోలీసులు కూడా తగిన విధంగా మర్యాద చేస్తారు."

అశోక్ పెదవి విప్పాడు. "ఇంతకీ మీకేం కావాలి? ఎందుకు నా వెంట పడ్డారు?"

"నాకు దొంగనోట్ల గురించి నిజానిజాలు కావాలి. మీరు ఆ రెండు లక్షలు ఏం చేశారో తర్వాత చెప్పుదురు గాని! మీరీ దొంగనోట్ల చలామణీ ఎప్పట్నుంచి చేస్తున్నారు? శారయ్య చూసేసరికి మీరు దొంగనోట్లు బ్రీఫ్‌లో పెట్టేసి మంచి నోట్లు తుండుగుడ్డలో చుట్టేశారు. కాని ఆ అమాయకుడు తనని చూడగానే తీసిన డబ్బు బ్రీఫ్‌లో పెట్టేశారనుకున్నాడు. అవి నకిలీవని అతనికి తెలీదు. ఆ తర్వాత పదిలంగా ఆ బ్రీఫ్ బీరువాలో దాచుకున్న మీ మామగారికి అంతకంటే తెలీదు."

అశోక్ అదిరిపడ్డాడు. శూన్యంలోకి చూస్తున్నాడు.

"మీరెండుకీ దొంగనోట్ల చలామణీలో తలమూర్చారు. ఎవరు ఆ ముఠా? మీకు వాళ్ళకి ఏమిటి టరమ్స్? మీ వాటా ఎంత?"

కిరణ్ మాటలకు అడ్డుపడి, "నాకు, వాళ్ళకి ఏం

సంబంధంలేదండి. నాకు అవసరపడి రెండు లక్షలు మా మామగారివి తీసుకున్నమాట నిజం. అసలు మామగారి బ్రీఫ్‌లో రెండు లక్షలున్న విషయంకూడా నాకు అతనే చెప్పాడు" అన్నాడు.

"ఎవరను?"

"నాకు దొంగనోట్లిచ్చినతను."

"ఎందుకిచ్చాడు?"

"మా మామగారి బ్రీఫ్‌లో పెట్టమని!"

"వివరంగా చెప్పండి."

"చెపుతాను—కాని ఈ విషయాలేవీ నా భార్యకు గాని, మా మామగారికిగాని చెప్పకూడదు."

"అలాగే, చెప్పండి!"

అశోక్ ఏదో చెప్పబోయేంతలో జయప్రద రెండు కాఫీ కప్పుల్తో వచ్చింది.

"మీరు తీసుకోండి. నేను నాన్నగరితో వాళ్లో తీసుకుంటాను" అని వెళ్ళిపోయింది.

కిరణ్, అశోక్ వంక చూశాడు.

అశోక్ గొంతు సవరించుకున్నాడు.

"అతనెవరో నాకు తెలీదు. ఇదివరలో యెప్పుడూ చూడలేదు కూడా. ఉదయం ఎంతో తెలిసినవాడిలా నా గదికొచ్చాడు. వాచ్‌మన్ నా స్నేహితుడినని చెప్పాడని లోనికి వదిలాడు. సమయానికి జయప్రదలేదు. అర్చన చేయించటానికి కోవెలకెళ్ళింది. మామగారు అరగంట క్రితమే బయటికి వెళ్ళిపోయారు.

"నువ్వెవరని అడిగితే అతను నవ్వి ఫూరుకున్నాడు. నీకు రెండు లక్షలొచ్చే మార్గం చెపుతాను, నాకేమి స్తావు? అనడిగాడు. ఏం కావాలని అడిగాను. అతను

తన వెంట తెచ్చిన బ్రీఫ్‌లోనించి రెండులక్షల వందనోట్లు పైన పెట్టాడు. నేను ఆశ్చర్యపోయాను.

"అతను నవ్వి, యివి నిజం నోట్లు కాదు, నకిలీవి. నిజం నోట్లు మీ మామగారు మరో గంటలో యిక్కడికి తీసుకొస్తాడు. అందులో నోట్లు తీసుకుని, వీటిని బ్రీఫ్‌లో సర్దెయ్యి సమయం చూసి! అంతే, నాకేం ప్రతిఫలం అక్కర్లేదు" అన్నాడు.

"నేను మొదట ఒప్పుకోలేదు. ముక్కూ మొఖం ఎరగని వ్యక్తి నాతో టరమ్స్ మాట్లాడుంటే నాకే ఏదోలా అనిపించింది. తిరస్కరిద్దామనుకున్నాను. కాని రెండు లక్షల రూపాయలు వదులుకోవటానికి మనస్కరించలేదు. నా అవసరాలు అలాంటివి!

"కనీసం కారణం చెప్పమన్నాను. అతను చెప్పిందేమిటంటే—వాళ్ళ గ్యాంగ్ దొంగనోట్లని చలామణీ చేయబోతోందట. ఆ నోట్లు ముందుగా మా మామగారిద్వారా బయట చలామణీ చేస్తారట. ఆ నోట్లు ఎవరూ అనుమానించకపోతే అప్పుడు ధైర్యంగా వాటిని అన్నిచోట్లా చలామణీ చేయిస్తారట.

"మా మామగారు కేసులో యిరుక్కుంటేనో అనడిగాను. అటువంటిదేం రాదని, మా మామగారివంటి కోటీశ్వరుడ్ని ఎవరూ అనుమానించరనీ, అందుకే ఆయన్ను మొదటసారిగా తమ ప్రయోగానికి యెన్నుకున్నామనీ అతను చెప్పాడు. నేను నమ్మాను. ఎవరికీ ఈ సంగతి చెప్పొద్దని అతను మరీమరీ చెప్పి వెళ్ళిపోయాడు.

"ఆ తర్వాత ఓ గంట తర్వాత మామయ్య బ్రీఫ్‌తో బ్యాంకునించి కేష్ తెచ్చారు. నేను వెంటనే పథకం అమల్లో పెట్టేశాను. ఆ సంగతి కారయ్య చూశాడనే

ఉక్రోషంతో వాడ్ని యింట్లోంచి వెళ్ళగొట్టించాను. అంతే, అంతకుమించి ఆ దొంగనోట్ల విషయం నాకేం తెలియదు" గుక్క తిప్పుకోకుండా చెప్పేశాడు.

"ఆ వ్యక్తి ఎలా వుంటాడు?"

"వయసు ముప్పయి వుండొచ్చు. ఎర్రగా పొడవుగా వున్నాడు. లాల్చీ, పైజామా వేసుకున్నాడు...."

కిరణ్ మనసులో పిల్లిగడ్డం వ్యక్తి మెదిలాడు. అతనన్న మాటలు చెవుల్లో రింగుమన్నాయి. అది మరో అవతారమన్నమాట! పిల్లిగడ్డం కూడా వేషమే! అయితే, అశోక్ చెప్పిన గుర్తులు చాలావరకు పిల్లిగడ్డం వ్యక్తితో సరిపోతున్నాయి. అతనే ఈ నోట్ల చలామణిలో అగ్రస్థానం వహిస్తున్నట్లు తోస్తోంది.

ఇంతకీ ఎవరతను? తక్కిన ముగ్గురు ఎవరు? ఇంకా వాళ్ళు ఎంతమంది వున్నారు? తనని ఫోన్‌లో బెదిరించిన వాళ్ళెవరు? తన యింటికొచ్చిన వాళ్ళెవరు?

కిరణ్ అకస్మాత్తుగా అశోక్ కాళ్ళవంక చూశాడు. ఏనుగు పాదాల్లాగా వున్నాయి. పదకొండు అంగుళాలకి తక్కువ పొడవులేదు కాలు. కచ్చితంగా అతను కాదు. యిక అడగనక్కర్లేదు!

"మీరిప్పుడు చెప్పిన విషయాలు నేను నమ్మొచ్చా?"

"ఎంతమాట సార్! నేను డబ్బుకోసం నీతిమాలిన పని చేసినంత మాత్రాన నాది నీతిలేని బతుకుకాదు. నేను చెప్పినవి నూటికి నూరుపాళ్లు నిజం!"

"ఆల్‌రైట్! తెలిసో తెలీకో మీరు కూడా దేశద్రోహులతో చేతులు కలిపారు. అయితే అతను మీకు చెప్పినట్లుగా నోట్లను చలామణికి తీసుకురావటానికి కాదు మీ మామగారిని ఎన్నుకొన్నది! ఆ నోట్లను చలామణీ చేసే

సందర్భంలో మీ మామగారు పోలీసులకి పట్టుబడాలని! మీ మామగారి పరువు ప్రతిష్ఠలు వీధిన పడాలని. అయితే మీ మామగారు ముందుగానే మేలుకున్నాడు."

అశోక్ నోరు తెరుచుకుని వింటున్నాడు.

"నేను వస్తాను" డిటెక్టివ్ కిరణ్ లేచి బయటికి నడిచాడు.

7

"ఏమైనా తెలిసిందా?" ఆతృతగా అడిగాడు శ్రీనివాస్.

"నీకు మళ్ళీ ఎలాంటి మెసేజెస్ రాలేదా?" ఎదురు ప్రశ్న వేశాడు కిరణ్.

"లేదు. ఇదివరలో ఫోన్ చేసిన వ్యక్తి ఎవరో కూడా తెలీదు. నేను పంపిన మెసేజ్‌లన్నీ ఏమైపోయాయో అర్థంకావటలేదు. చాలా తెలివిగా మన కళ్ళుముందే ఆ ద్రోహులు తప్పించుకుపోయారు!"

"వాళ్ళని అంత తేలిగ్గా వదులుతామా? చూద్దాం, ఎక్కడికి పోతారు?"

కిరణ్, శ్రీనివాస్‌కి ఏం చెయ్యాల్సిందీ చెప్పాడు. శ్రీనివాస్ శ్రద్ధగా విని తలూపాడు.

కిరణ్ టయోటా స్టార్టుచేశాడు. సరాసరి జి.ఎన్.టి. రోడ్‌న పోనిచ్చాడు.

సాయంత్రం ఆరుగంటల సమయం. రోడ్డు మామూలుగానే రద్దీగా వుంది. లోడ్ లారీలు నిండు గర్భిణీల్లాగా రోడ్‌న వస్తూ పోతున్నాయి. రకరకాల గూడ్సు ప్రతిరోజు హైదరాబాదుకి రవాణా అవుతునే వుంటాయి. హైదరాబాదునించి జిల్లాలకు కూడా అలాగే సరుకులు చేరవేస్తుంటాయి ప్రతిరోజు, లారీలు.

మలుపు దాటాడు.

సూర్యాపేట జంక్షన్ దగ్గరికొచ్చాడు.

ఎనిమిది గంటలు చూపిస్తోంది గడియారం.

టయోటాని పక్కగా తీసి పార్కు చేశాడు. కారు దిగాడు. కోటుజేబు తడుముకున్నాడు. రివాల్వర్ గట్టిగా తగిలింది.

కారు దిగేముందు యిగ్నిషన్ బోర్డు పక్కనున్న బటన్ నొక్కాడు కిరణ్.

అంతవరకు క్రీం కలర్‌లో వున్న టయోటా తనరంగు మార్చుకుంది. నీలిరంగుకి మారింది. అదంతా టయోటాపైన తాత్కాలికంగా ఏర్పడ్డ మైకా కాగితం పొర అనీ, నీలిరంగు ఆ పొర దేనని చూసేవాళ్ళు దాని ఒరిజినల్ కలర్ నీలిరంగు దేనని పొరపడతారనీ కిరణ్‌కి తెలుసు.

బయటనించి దాని అద్దాల తలుపులన్నీ మూసి లాక్ చేసేశాడు. టార్చి చేతపట్టుకున్నాడు.

రోడ్ జంక్షన్ దగ్గర నించున్నాడు.

లారీలు వస్తున్నాయి. పోతున్నాయి. చిన్న కార్లు ఏవైనా వస్తున్నాయేమోనని చూశాడు. కాని ఏమీ రావటంలేదు.

ఓసారి తనవంక పరీక్షగా చూశాడు. సన్నిహితులు కూడా తనని యీ క్షణంలో గుర్తుపట్టడం కష్టం. పూర్తిగా సిక్కు వేషంలో వున్నాడు. గడ్డం, మీసం, తలపాగా అన్నీ అచ్చు పంజాబీలా మేకప్ చేసుకున్నాడు.

లాంగ్ జర్నీ చేసే లారీలు ఆ జంక్షన్ దగ్గర ఆగుతుంటాయి. అక్కడ కిళ్ళీబడ్డీలు, ఓ మాంసాహార హోటలు, పెట్రోలు బంకు వెలిశాయి. నిత్యం అక్కడ

డ్రయివర్లు తిని తాగుతుంటారు. ఓ గంట విశ్రాంతి అనంతరం తమ ప్రయాణాలు కొనసాగిస్తూంటారు. రాత్రిళ్ళే ఎక్కువగా లారీలు తిరుగుతుంటాయి.

కిరణ్ ఆలోచిస్తున్నాడు. సూర్యాపేటవైపు గాని ఖమ్మం రోడ్డునగాని వాళ్ళు తప్పించుకుపోలేదు. మూడో దారినుంచే తప్పించుకున్నారు. అది సరాసరి అడవిలోకి దారితీస్తోంది. అంటే ఆ దుండగుల స్థావరం అడవిలోనే అయివుండాలి. లేదా అడవిలో యీ నోట్లను చేతులు మార్చుకుని, మళ్ళీ ఎవరిమట్టుకు వారు విడిపోతూ వుండి వుండాలి.

ఇలా బహుశా ప్రతిరోజూ జరక్కపోవచ్చు. కాని, అలవాటుపడ్డ వ్యక్తులు సాధారణంగా తమ సంకేత స్థలాన్ని మాటిమాటికీ మార్చరు. అందుకే తను ధైర్యంగా యిక్కడికొచ్చారు. వాళ్ళు యీ రోజు కాకపోయినా మరో రోజైనా యీ స్థలానికి వచ్చి తీరతారని తనకు గట్టి నమ్మకం!

వాచీ చూసుకున్నాడు. గడియారం పది గంటలు చూపిస్తోంది. హోటలు దగ్గర రద్దీ పెరుగుతోంది.

మొన్న యింతకంటె ముందే వాళ్ళు యిక్కడి కొచ్చారు. బహుశా ఎనిమిదిగంటలవుతుంది. ఈ రోజు యిప్పటిదాకా రాలేదు. తన ఉనికి వాళ్ళకు తెలిసే అవకాశంలేదు. తనని ఎవరూ గుర్తించే అవకాశం కూడా లేదు! టయోటా కూడా రంగు మార్చుకుంది.

హోటల్ దగ్గర జనం పలచబడిపోయారు. అంత వరకు కోలాహలంగా వున్న ఆ ప్రదేశం నిశ్శబ్దంగా తయారయింది. లారీలు వెళ్ళిపోయాయి. ఒకటీ, అరా యింకా మిగిలిపోయాయి.

పదకొండున్నర అయింది. దుండగులు రాలేదు.

కిరణ్ యిక తిరిగి వెళ్ళిపోదామన్న నిర్ణయాని కొచ్చాడు. కారు దగ్గరికి నడవబోయాడు.

సరిగ్గా అదే సమయంలో హైద్రాబాద్ నించి ఏదో చిన్న కారు వస్తూన్నట్టు హెడ్ లైట్సునిబట్టి గ్రహించాడు.

తన కారు దగ్గరికి రెండంగల్లో వెళ్ళి బోనెట్ ఎత్తాడు. సీరియస్ గా రిపేరు చేస్తున్నట్టు నటించసాగాడు.

ఆ కారు దగ్గర పడింది. క్రీగంట చూశాడు.

అది డాట్సన్ కారు. చాలా వేగంగా వస్తోంది.

ఎటూ ఆగకుండా అడవిదారివైపు దూసుకుపోయింది.

కిరణ్ కళ్ళు మెరిశాయి.

అనుమానం లేదు. అందులో వున్న వ్యక్తులు ఖచ్చితంగా దొంగనోట్ల స్మగ్లర్సే. వాళ్ళకి ఏమాత్రం అనుమానం రాలేదనటానికి నిదర్శనం-సరాసరి తమ స్థావరం వైపు దూసుకుపోవటమే!

కిరణ్ బోనెట్ మూసేశాడు.

చకచక నడవసాగాడు. అడవిదారి అయినా కంకర రోడ్డుంది. బహుశా లారీలు లోపలికి వెళ్తూ వస్తూ వుండొచ్చు! అడవినుంచి కలప, బొగ్గు రవాణా అవుతుంటాయి.

8

కిరణ్ నడుస్తున్నాడు.

తను చేస్తున్న పని చాలా ప్రమాదకరమైందని అతనికి తెలుసు. వాళ్ళకేమాత్రం దొరికినా నిలువునా చంపేస్తారని తెలుసు. అయినా అతను పట్టు విడవలేదు. కారులో వెళ్తే వాళ్ళకి కారు శబ్దంవల్ల తెలిసిపోతుంది.

అందుకే నడిచే వెళ్ళటానికి నిర్ణయించుకున్నాడు. తను ఒక్కడే కాబట్టి సమయానికి ఏ పొద చాటునో, చెట్టు చాటునో దాక్కొని అన్నీ గమనించవచ్చు.

కిరణ్ జాగ్రత్తగా ముందుకి నడుస్తున్నాడు. అర చేయి అడ్డుపెట్టి టార్చి ఫోకస్ చేసుకుంటూ వెళు న్నాడు. తనకి దారి కనిపించటానికి కాళ్ళముందుమాత్రమే వెలుతురుపడేలా జాగ్రత్త తీసుకున్నాడు.

దూరంగా కారు కనిపిస్తోంది. అక్కడినుంచి అడివి మొదలయినట్టుంది. చెట్లు చాలా దట్టంగా కనిపిస్తు న్నాయి. దారికి అటు ఇటు చెట్లున్నాయి అక్కడినుంచి కిరణ్ సరాసరి రోడ్డునకాకుండా చెట్లపక్కగా నడవ సాగాడు.

చటుక్కున ఎవరైనా గమనించినా చెట్టు చాటున దాక్కోవచ్చు. అక్కడ పొదలు కూడా దట్టంగా వున్నాయి. ఎండుటాకులమీద జరజర పాకుతున్న చప్పుళ్ళు తరచు వినిపిస్తూనే వున్నాయి. ముందుగానే మోకాళ్ళవరకు కవర్ చేసే షూ — ఫైర్ సర్వీస్ వాళ్ళు వేసుకునే షూ—ధరించాడు కిరణ్. ఏ విష పురుగైనా ముట్టుకున్నా మరేం ప్రమాదంలేదు.

కారు సమీపించింది. అదే డాట్సన్ కారు.

కిరణ్ అడుగులో అడుగేస్తూ నడుస్తున్నాడు.

కారు దగ్గర ఎవరూ లేరు. అసలు అక్కడ జన సంచారమే కనిపించటంలేదు. వంగి కారు చక్రాలనుంచి గాలి విప్పేశాడు. తుస్సుమంటూ చక్రాలు భూమిని కరుచుకున్నాయి.

కిరణ్ చుట్టూ పరిశీలనగా చూశాడు. చీకటికి అతని కళ్ళు బాగా అలవాటుపడ్డాయి.

అడవి లోపల ఎక్కడో వెలుతురు కనిపిస్తోంది.

కిరణ్ అడవిలోకి ప్రవేశించాడు. అటు యిటు కాషస్‌గా చూసుకుంటూ నడుస్తున్నాడు.

వెలుగు కనిపించిన వైపు అడుగులు వేశాడు.

అది ఫారెస్టు గార్డు వుండటానికి కట్టబడ్డ నివాస గృహం! అక్కడే లైటు కనిపిస్తోంది.

పెట్రోమాక్స్ లైటు వెలుగుతోందక్కడ.

అక్కడ అయిదుగురు వ్యక్తులున్నారు.

అందులో పిల్లిగడ్డం వ్యక్తిని వెంటనే గుర్తుపట్టాడు కిరణ్. అతనిప్పుడు బవిరిగడ్డం బాగా పెంచుకుని వున్నాడు. మీసాలు కూడా బాగా పెంచినట్టు మేకప్ చేసుకున్నాడు.

అందులో మోటుగా మొద్దుగా వున్న వ్యక్తిని చూడగానే త్రుళ్ళిపడ్డాడు కిరణ్.

అతను శారయ్య! హరప్రసాద్ నౌఖరు. అమాయకుడిగా తను ఘోరంగా పొరబడ్డ శారయ్య! అతనికీ ఈ దొంగనోట్లతో సంబంధముందనుకోవాలంటే అతని మనసు అంగీకరించటంలేదు. ఏదో ప్రలోభపెట్టో, అతని భార్యాబిడ్డల్ని చంపుతానని బెదిరించో వశపరచుకుని వుంటారనుకున్నాడు కిరణ్. అందుకే ఆ రోజు చెవర్లెట్ కారు తనకి ఆ ప్రాంతంలో కనిపించింది.

తక్కిన ముగ్గురిలో ఒకడు తనని రివాల్వర్ హేండిల్‌తో గాయపరిచినవాడు. మిగిలిన యిద్దరు తనకి కొత్త. ఆ రోజు శారయ్య యింటి సమీపంలో పెట్టెలు తన కార్లోకి మార్చిన వాళ్ళను గుర్తుచేసుకున్నాడు. కాని పోలికలు సరిపోవటంలేదు.

బవిరిగడ్డం వ్యక్తికి ముందు నాలుగు చెక్కపెట్టె

లున్నాయి. వాటినిండా వందరూపాయిల నోట్లు! చిత్తు కాగితాల్లాగా వున్నాయి.

తక్కిన యిద్దరు వ్యక్తులకి వాటినీ అప్పగిస్తున్నాడు. వాళ్ళు బ్రీఫ్ కేసు తెరిచి నోట్ల కట్టలు చూపించారు. బవిరిగడ్డం వ్యక్తి వాటిని పైకితీసి పరీక్షగా చూసుకుని సంతృప్తిగా తలూపాడు.

కిరణ్ కి అర్థమయింది. నాలుగు చెక్క పెట్టెల్లో వున్న దొంగనోట్ల ఖరీదు ఆ బ్రీఫ్ కేసులోని నిజం కరెన్సీ నోట్లు! బహుశా ఏ పదో వంతుకో అమ్మకం జరిగిపోతుండ వచ్చు. ఆ లెక్కన ఆ చలామణీచేసే వ్యక్తికి పదిరెట్లు లాభం దొరుకుతుంది.

కిరణ్ పళ్ళు కొరికాడు. అందరూ ఈ దేశంవాళ్ళేనని పోలికలే చెబుతున్నాయి. దేశద్రోహులు! ఇలాంటి వాళ్ళని నిలువునా చీరెయ్యాలి.

కిరణ్ చెయ్యి రివాల్వర్ మీద బిగుసుకుంది.

ఇంతలో మరో ముగ్గురు వ్యక్తులు లోపల్నించి వచ్చారు.

ఆ తక్కిన యిద్దర్నీ కిరణ్ గుర్తుపట్టాడు. వీళ్ళే ఇదివరకు చెవర్లెట్ నుంచి చెక్క పెట్టెల్ని తన కారులోకి మార్చినవాళ్ళు. మూడో వ్యక్తి ఫారెస్టు గార్డులా వున్నాడు. ఖాకీ బట్టలు వేసుకున్నాడు. ఈ దేశద్రోహుల లిస్టులో అతనూ చేరిపోయాడన్నమాట! అందుకే వాళ్ళు ఆ ప్రదేశాన్ని సంకేత స్థలంగా పెట్టుకున్నారు. అతని మద్దతుతోనే.

కిరణ్ లోపల్నుంచి వచ్చిన ఆ యిద్దరు వ్యక్తుల కాళ్ళవంక చూశాడు. ఎస్, అవే చెప్పులు. అవే కొలతలు. తనకి బాగా గుర్తు. వాళ్ళ చెప్పులతో వచ్చిన

దుమ్ముకూడా యిక్కడి జేగురు బూడిదలాగానే వుంది! ఆ రోజు తన యింటికొచ్చి గూర్ఖాని గాయపరిచిన వాళ్లు వీళ్ళే! గూర్ఖా చెప్పిన పోలికలు వీళ్ళలో స్పష్టంగా వున్నాయి.

ఇద్దరిలో ఒకడు పచ్చి నెత్తురు తాగే రాక్షసుడిలా వున్నాడు! ఆ రోజు చెక్క పెట్టెలు మార్చేసమయంలో తను వీళ్ళ పోలికలు సరిగ్గా చూడలేదు. వాళ్ళు కూడా పరిశీలించే అవకాశం దొరకలేదు. లేకుంటే ఆ వాడే గుర్తుపట్టి వుండేవాడు.

ఎక్కడినుంచో లారీ శబ్దం వినిపించింది.

కిరణ్ తల తిప్పి చూశాడు. లారీ వచ్చి బయట ఆగింది.

శారయ్య ఓ చెక్క పెట్టె భుజంమీదికి ఎత్తుకున్నాడు. లోపల్నుంచి వచ్చిన యిద్దరు వ్యక్తులు చెరో పెట్టె ఎత్తుకున్నారు. తనని గాయపరిచిన వ్యక్తి నాలుగో పెట్టె ఎత్తుకున్నాడు.

బ్రీఫ్ యిచ్చిన వ్యక్తులిద్దరు బవిరిగడ్డం వ్యక్తితో కరచాలనం చేశాడు. కరెన్సీ చలామణీ కావటానికి ఉరకలు వేస్తోందన్నమాట!

సమయం చేజారిపోతోంది. కిరణ్ చెవులు రిక్కించి విన్నాడు. ఎక్కడా ఎలాంటి శబ్దమూ లేదు.

పెట్టెలు లారీలో లోడవుతున్న చప్పుడు వినిపిస్తోంది. బవిరిగడ్డం వ్యక్తి, ఫారెస్టుగార్డుతో బాటు అందరు లారీ దగ్గరకు వెళ్లారు.

శారయ్య లారీ మీదికెక్కి లోడ్ చేస్తున్నాడు.

నాలుగు పెట్టెలు వేసేశాడు. పైన ఏవో బస్తాలు సర్దేస్తున్నాడు. అప్పటికే లారీలో కొంత లోడ్ వుంది.

అవి తౌడు బస్తాలో చిట్టు బస్తాలో అయి వుంటాయి. చాలా తేలిగ్గా పైకి లేపుతున్నాడు కారయ్య. హైద్రాబాదునుంచి తౌడు లోడ్ జిల్లాలకు రవాణా కావటం తనకు తెలుసు!

కారయ్య దిగిపోయాడు.

లారీ కదలటానికి సిద్ధంగా వుంది. కిరణ్ యిక ఆలస్యం చెయ్యలేదు. బవిరిగడ్డం వ్యక్తి దగ్గరగాని, తనని గాయపరచిన వ్యక్తి దగ్గరగాని ఆయుధాలేవీ కనిపించటంలేదు. బహుశా తమని ఎవరూ పట్టుకోలేరన్న ధీమాతో వున్నట్టున్నారు. లారీ స్టార్టయింది.

కిరణ్ వెంటనే గురి చూసి ముందు చక్రాన్ని కాల్చాడు. వెంటనే గాలిపోయి చక్రం నేలకి అతుక్కుంది.

ఒక్కసారిగా అందరిలోను కలకలం చెలరేగింది.

బవిరిగడ్డం చేతిలోకి పిస్తోలు వచ్చేసింది.

తనని గాయపరిచిన వ్యక్తి చేతిలో కూడా పిస్తోలు నిగనిగ మెరుస్తోంది.

కారయ్య, ఫారెస్టుగార్డు, తక్కిన యిద్దరు వ్యక్తులు, లారీ డ్రయివరు, కరెన్సీ కొనుక్కున్న యిద్దరు మనుషులు గుంపుగా కూడిపోయారు.

వాళ్ళు తొమ్మిదిమంది! తనొక్కడు.

బవిరిగడ్డం వ్యక్తి కిరణ్ వైపు గురిచూసి కాల్చాడు. అదే సమయంలో రెండో వ్యక్తి కూడా కాల్చాడు. వాళ్ళకు కిరణ్ కనిపించటంలేదు. కాని కిరణ్‌కి వాళ్ళందరూ కనిపిస్తున్నారు.

కిరణ్ బవిరిగడ్డం వ్యక్తి చేతికి గురిచూసి కాల్చేశాడు. అతని చేతిలోని పిస్తోలు దూరంగా ఎగిరిపడింది.

రెండో వ్యక్తి మళ్ళీ కాల్చాడు. కిరణ్ ఈసారి కూడా ఆ గుండు దెబ్బనుంచి తప్పించుకున్నాడు.

కర్కశంగా వున్న వ్యక్తి పరుగెత్తుకెళ్ళి కిందపడి వున్న రివాల్వర్ని అందుకోవాలనుకున్నాడు కాని కిరణ్ అతని కాలికి గురిచూసి కాల్చగానే ముందుకి అమాంతం కూలిపోయాడతను. తక్కినవాళ్ళు ధైర్యం చెయ్యలేక పోయారు.

కిరణ్ బుల్లెట్స్ లోడ్ చేసుకోవటానికి ప్రయత్నించే లోపల రెండో వ్యక్తి కిరణ్ ఉనికిని గుర్తించి సరిగ్గా గురిచూసి కాల్చాడు.

కిరణ్ చేతిలోని రివాల్వర్ ఎగిరి అవతలపడింది. అతని కుడిచేతికి గాయమైంది. రక్తం ధారకట్టింది.

కిరణ్ చటుక్కున పక్క పొదల్లోకి తప్పుకున్నాడు. తన ఉనికి తెలిసిపోయింది. వాళ్ళకి దొరికిపోయినట్టే!

ఆ వ్యక్తితోపాటు అందరికీ కిరణ్ ఆయుధం పడిపోవటం స్పష్టంగా వినిపించింది. ధైర్యంగా పొదవైపు పరుగెత్తుకొచ్చేశారు.

సరిగ్గా అదే సమయంలో మహావేగంగా రెండు జీప్లు దూసుకొచ్చేశాయి. దాన్నిండా పోలీసులు!

"ఎవరూ కదలొద్దు" అన్న ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కంఠం గంభీరంగా వినిపించింది. కిరణ్ తేలిగ్గా శ్వాస వదిలాడు.

బవిరిగడ్డం వ్యక్తి, అతని అనుచరులు, కరెన్సీ కొనుక్కున్న వ్యక్తులు, లారీ డ్రయివరు, ఫారెస్టుగార్డు-అందరూ దొరికిపోయారు.

శ్రీనివాస్ కిరణ్ దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు, కిరణ్

పొదనుంచి బయటికి రాగానే.

బవిరిగడ్డం వ్యక్తి క్రూరంగా చూశాడు కిరణ్ వంక.

"నిన్నారోజే చంపకుండా వదలటం పొరపాటయి పోయింది. మావాడు గాయపరచి వూరుకున్నాడుగాని, నేను చంపేసి తోసి వుండేవాడ్ని! ఈ ఒక్కసారికే ఈ స్థావరంలో పని ముగించుకుని తరవాత సంకేత స్థలం మార్చేయాలనుకున్నాం. కాని వీళ్ళకు చానాళ్ళ క్రితమే ఈ చోటు గురించి చెప్పి వుండటంవల్ల యిక్కడికి రాక తప్పలేదు" అంటూ తన బాధ వెళ్ళగక్కుకున్నాడు ఆ వ్యక్తి.

కిరణ్ తన యింటికొచ్చిన వ్యక్తులిద్దర్నీ చూసి, "మీకు హరప్రసాద్ ఏం హాని చేశాడు? ఎందుకు అతని వెంటపడ్డారు?" అనడిగాడు.

కర్కశంగా వున్న వ్యక్తి చెప్పాడు. "నేను అతని థియేటర్లో మేనేజర్‌గా పనిచేశాను. నన్ను పనినుంచి తొలగించాడు. దాంతో ఎలాగైనా నా కక్ష తీర్చు కోవాలనుకున్నాను. అందుకే యిదిగో మావాడి ద్వారా రెండు లక్షల దొంగనోట్లు హరప్రసాద్ అల్లుడిద్వారా మార్పిడి చేయించాను. ఆ విషయంలో నాకు శారయ్య చాలా సాయం చేశాడు. అవకాశం దొరికితే హర ప్రసాద్ అల్లుడ్నికూడా ఈ దొంగనోట్ల కేసులో యిరి కించాలనుకున్నాను...."

"అయితే పార్థసారధిని నువ్వేనన్నమాట!" అన్నాడు కిరణ్. అవునని తలూపాడతను. అశోక్ పొరబడి బవిరి గడ్డం వ్యక్తి పోలికలు చెప్పాడు. కాని కేష్ తెచ్చి యిచ్చినది ఆ రెండో వ్యక్తి. అతనికి, బవిరిగడ్డం మనిషికి

దగ్గర పోలికలున్నాయి.

"మీరేనా ఆ రోజు నా యింటికొచ్చి నా గూర్ఖాను గాయపరిచినది?"

పార్థసారధి తలూపాడు.

"జంక్షన్‌లో నీ టయోటా కనిపించింది. నువు చెప్పావు కదా! అయితే మధ్యలో ఓ జీపు ట్రబులిచ్చింది. అందుకే రావటం బాగా ఆలస్యమయింది" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్ నీరసంగా నవ్వాడు.

—:అయిపోయింది:—